క్లుప్తంగా

ఏకాదశ రుద్రులను దర్శించుకున్న జొన్నవిత్తుల



గంగలకుర్రు శివాలయాన్ని దర్శించుకున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

అంబాజీపేట: ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యంపై పాట రాసేందుకు ప్రముఖ సినీ గేయ రచయిత డా.జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు కోనసీమలో కొలువైన ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. అంబాజీపేట మండలంలో ఉన్న వ్యాఘ్రేశ్వరం, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ముక్కామల, వక్కలంక, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, కె.పెదపూడి, అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి, అయినవిల్లి మండలం నేదునూరులలో వేంచేసిన ఏకాదశ రుద్రులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జొన్నవిత్తుల ఏకాదశ రుద్రుల ఆలయాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు, వేద పండితులు ఉన్నారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ



సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దొడ్డా శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నాత్ర ఉమామహేశ్వరరావు మండపం నిర్మించారు. అడబాల శ్రీమన్నారాయణ సోదరుల ఆర్థికసాయంతో నిర్మాణం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ అడబాల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 1008 కలశాల పూజ



మోరిలో అయ్యప్పస్వామి ఆలయం నమూనాతో ఏర్పాటు చేసిన 18 మెట్లు

సఖినేటిపల్లి: మోరి వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద సోమవారం పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో పల్లపోతు పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్ప భక్తులు 1008 కలశల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో తొలుత పేరాబత్తుల వెంకటరత్నం–లక్ష్మీ పోసికుమారి, ఆకుల నరేష్–ఊర్వశి కనకదుర్గ ధనలక్ష్మి దంపతులు, అయ్యప్ప స్వాములతో లక్ష్మీగణపతి హోమం చేయించారు. దీపారాధన, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత కలశారాధన, చతుర్ధ కలశారాధన, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలశాలతో అయ్యప్ప భక్తులు ఊరేగింపు నిర్వహించారు. టేకిశెట్టిపాలెం పుష్కర ఘాట్ వద్ద నుంచి పవిత్రమైన గోదావరి జలాలను కలశాలతో తెచ్చారు. పూజలో ఆచంట వాస్తవ్యుడు తోట శివస్వామి 18 మెట్ల పూజ వైభవంగా భక్తులు నిర్వహించారు. కలశల పూజ పురస్కరించుకుని కటికిరెడ్డి మహేష్ స్వామి వారి ఆధ్వర్యంలో జ్యోతి స్వరూప అయ్యప్ప భజన సమాజం మంగళంపల్లి సత్తిపండు గురుస్వామి భక్తి కీర్తనలు ఆలాపన చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో 22 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.17 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. రాజోలు నియోజకవర్గ శాసనసభ్యుడు దేవ వరప్రసాద్ లబ్ధిదారులకు విశ్వేశ్వరాయపురం శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో అందించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, నాయకులు ఆకుల చిన వెంకన్ననాయుడు, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, పినిశెట్టి బుజ్జి, అడబాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చిలి ఎత్తిపోతలపై నిర్లక్ష్యం

- పాడైన మోటార్లు
- శివారు ప్రాంతాలకు ఈ పథకమే ఆధారం
- ఆధునీకరణకు చర్యలు శూన్యం



ఉచ్చిలి ఎత్తిపోతల పథకం

ఆత్రేయపురం: శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాల్సిన ఎత్తిపోతల పథకం శిథిలస్థితికి చేరుకుంది. ఆత్రేయపురం మండలంలోని ఉచ్చిలి ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పథకాల్లో మోటార్లు పాడైపోవడంతో శివారు ప్రాంత రైతులు బోర్ల ద్వారా సాగునీరుపై ఆధారపడాల్సిన దుస్థితి. సుమారు 6 వేల హెక్టార్లలో రైతులు పంటను సాగు చేసుకుంటున్నారు. ముఖ్యంగా పంపింగ్ స్కీమ్‌లో మూడు మోటార్లు పూర్తిగా పాడైపోవడంతో పాటు పథకం శిథిలస్థితికి చేరుకుంది. శివారు ప్రాంతాలకు సాగునీరు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ అంశంపై ప్రజాప్రతినిధులు, రైతులు అనేకమార్లు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రైతుల బాధలు వర్ణనాతీతం. ఆందోళన సమయంలో తూతూమంత్రంగా చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారు. శివారు ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు బోర్లపైనే ఆధారపడుతున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా ఉచ్చిలి, వాడపల్లి, ఆత్రేయపురం, లొల్ల, మెర్లపాలెం గ్రామాల రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ఎత్తిపోతల పథకంలో మోటార్లు పాడైపోవడంతో పాటు పంట కాలువలు మూసుకుపోవడంతో చుక్కనీరు అందక రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నాడు. ప్రతిపక్ష నేతల ఆందోళనలు, రైతులు ఆక్రందనలు, అధికార పార్టీ నేతల హామీలు మినహా రైతులను పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కానరావడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఎత్తిపోతల పథకంలో మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ ఆధునీకరణకు చేపడుతున్న చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. దీంతో పంపింగ్ స్కీమ్ ఉన్నప్పటికీ పంటలకు చుక్కనీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ ఎత్తిపోతల పథకం ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నీరు అందక ఇక్కట్లు



ఏటా ఎత్తిపోతల పథకాల వద్ద ఆందోళనలు చేస్తున్నామే గానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పథకం శిథిలస్థితికి చేరింది. సాగునీరు అందక ఏటా నష్టాల బారిన పడుతున్నాం.

– సాగిరాజు శ్రీనివాసరాజు, ఆత్రేయపురం, రైతు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం



పథకం శిథిలావస్థకు చేరడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. మోటార్లు మరమ్మతులు చేయించేందుకు తగు చర్యలు చేపడతాం.

– వెన్నా మాధవ్, ఇరిగేషన్ ఏఈ, లొల్ల

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

అంబాజీపేట: భూ సర్వేలోని సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు దోహద పడతాయని అంబాజీపేట డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పసుపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభను సోమవారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ భూ సర్వేలో ప్రతి రైతుకు సంబంధిత వివరాలను పొందుపర్చామన్నారు. భూమి విషయంలో విస్తీర్ణం, కొలతలు, ఇతర సమస్యలున్నట్లయితే లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిన్నింటినీ పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతులు వినతులు, ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుక తవ్వకాలు ప్రారంభం

ఆలమూరు: మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపు నుంచి సోమవారం ఉచిత ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సొంత అవసరాల కోసం ట్రాక్టర్లపై ఉచిత ఇసుకను తరలించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్థానిక గౌతమీ గోదావరిలో ఏర్పాటు చేసిన ఈ ర్యాంపును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు.

దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



పలివెలలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ఆలయాలు, పాత ఆలయాల పునర్నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరుస్తోందని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల కోటమెరకలో పూర్వం ఆంజనేయ స్వామి ఆలయం స్థానే గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు, ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రెసిడెంట్ మోకా పెద్ద, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆ ఆలయ ప్రారంభం, ఆలయంలో వరసిద్ధి వినాయక స్థిర ప్రతిష్ఠ పూర్వక భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయం ముందు 27 అడుగుల ఆంజనేయస్వామి భారీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి ఆలయానికి తోడ్కొని వెళ్లారు. ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనాల నడుమ ఘనంగా సత్కరించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేవదాయ శాఖ, శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.14.35 కోట్లతో నియోజకవర్గంలో పలు దేవాలయాలకు నూతన శోభ తీసుకువచ్చామని తెలిపారు. 44 ఆలయాలకు రూ.4.40 కోట్లు విడుదల చేయించామన్నారు. జగ్గిరెడ్డి వెంట ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఉమా కొప్పేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ధర్మసత్రం మాజీ చైర్మన్ చప్పిడి సాయిబాబు, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మోకా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి ఆలయానికి తోడ్కొని వెళ్లారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

సాహితీ కళా జాతరలో ప్రపంచ రికార్డులు కైవసం



తాడేపల్లిగూడెంలో కళాబంధు పురస్కారంతో ప్రతాప్‌ను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

సఖినేటిపల్లి: తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 24 గంటల పాటు నాన్‌స్టాప్‌గా నిర్వహించిన సాహితీ కళా జాతరలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నాలుగు ప్రపంచ రికార్డులు కై వసం చేసుకున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ నిర్వహించిన పై కళా జాతరపై వివరాలను సోమవారం ప్రతాప్ మీడియాకు తెలిపారు. అమేజింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, కల్చరల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు, మార్వెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులలో ప్రతాప్ పేరు నమోదయింది. తెలుగు కల్చరల్ ఫెస్ట్ నిర్వహణలో పై సాహితీ కళా జాతర పేరుతో ఒకే వేదికపై కవిత్వం, కళలు, సాహిత్యం, రంగస్థల రంగాలపై వివిధ ప్రదర్శనలు 500 మంది కవులు, కళాకారులు ఇచ్చారని ప్రతాప్ వెల్లడించారు. కాగా ప్రతాప్ కృషిని ప్రశంసిస్తూ తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళాంబంధు పురస్కారాన్ని ఆయనకు సాహితీవేత్తలు ప్రదానం చేశారు. కల్చరల్ ఫెస్ట్ కన్వీనర్లు కొల్లి రమావతి, డాక్టర్ పార్థసారథి, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మాణిక్యాలరావు, బీవీ రామారావు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేత



వైద్య విద్యార్థికి స్కాలర్ అందిస్తున్న కేపటీడబ్ల్యూఏ సభ్యులు

పి.గన్నవరం: రాజులపాలెం శివారు అయినాలవారి పాలెం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని మద్దాలి దేవీశిరీషకు ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.90 వేలను స్కాలర్‌షిప్‌గా అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఆలీవ్ మిఠాయి అధినేత దొరరాజు, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత నాగకుమార్‌లు ఈ విద్యార్థిని వైద్య విద్య పూర్తి చేసే వరకూ ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారని కేపీటీడబ్ల్యూఏ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ పొల్నాటి నాగప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కేపీటీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు పైడిపర్తి చిన్ని, ప్రధాన కార్యదర్శి నంద్యాల నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు, నాగిరెడ్డి శివ ప్రసాద్, నల్లా రామకృష్ణ, పేపకాయల చంద్రరావు, దంగుడుబియ్యపు శ్రీనివాస్, నల్లా బాలాజీ, ముద్రగడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



ఆలమూరు–కొత్తూరు రహదారిలో జేసీబీ సాయంతో జరుగుతున్న తాత్కాలిక మరమ్మతులు

ఆలమూరు: ఆలమూరు నుంచి కొత్తూరు సెంటర్ వరకూ గోతులమయ్యంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారికి సోమవారం తాత్కాలిక మరమ్మతులు జరిగాయి. రహదారి దుస్థితిని, ప్రయాణికుల ఇక్కట్లను తెలుసుకున్న గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, దాత వంటిపల్లి కాశీ విశ్వనాథం స్పందించారు. తమ సొంత నిధులను వెచ్చించి జేసీబీ సాయంతో భారీ గోతులను పూడ్చించి అధ్వానంగా ఉన్న రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేసి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు పర్యవేక్షించారు. ఈ రోడ్డు అభివృద్ధిని ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోయినా మరమ్మతులకు చర్యలు తీసుకున్న కాశీ విశ్వనాథంను పలువురు అభినందించారు.

భారీ వర్షంతో రహదారులు అస్తవ్యస్తం



మామిడికుదురులో ముంపునకు గురైన జాతీయ రహదారి

జాతీయ రహదారిపై వర్షపునీరు

మామిడికుదురు: ఉత్తర అండమాన్‌లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి మండలంలోని పలు రోడ్లు ముంపునకు గురయ్యాయి. మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపాన 216వ నంబర్ జాతీయ రహదారిపై రెండడుగుల మేర వర్షం నీరు నిలిచి పోయింది. వర్షం నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డుపై భారీగా ముంపు నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరం, పాశర్లపూడి గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అప్పనపల్లి మలుపు నుంచి బి.దొడ్డవరం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ మార్గంలో ఓఎన్జీసీ రోడ్డు సమీపాన వర్షం నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో పాటు పలు గ్రామాల్లో సైతం ముంపు నీరు రోడ్లపైన, కాలనీల్లోను నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదుర్రు గ్రామంలోని గ్రామ పంచాయతీ సమీపాన ప్రధాన రహదారి పక్కన తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తాటిచెట్టు పక్కనే విద్యుత్ స్తంభాలు ఉండడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీంతో ప్రమాదం తప్పింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



రాజోలులో స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, స్థానికులు

రాజోలు: ప్రజా రక్షణలో ఎంతోమంది పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని రాజోలు సీఐ నరేష్‌కుమార్ అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని రాజోలు సర్కిల్ కార్యాలయం నుంచి సార్జెంట్ పిల్లా రవిప్రసాద్ స్మారక స్తూపం వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్మారక స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పొదలాడ గ్రామానికి చెందిన కోళ్ల వెంకన్నబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుడైన వెంకన్నబాబు సేవలను కొనియాడుతూ ఆయన సోదరుడు సత్యనారాయణను సత్కరించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు రాజేష్‌కుమార్, సురేష్ బాబు, దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అంబాజీపేట: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమరాజు మాట్లాడుతూ పోలీసులు మాతృభూమి శ్రేయస్సు కోసం నిస్వార్థంగా పనిచేసే శ్రామికులని కొనియాడారు. సమాజ రక్షణ, శాంతి భద్రత పరిరక్షణలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమైందన్నారు. అమరులైన పోలీసుల త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని, వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోలీసులు విధి నిర్వహణే పరమావధిగా భావిస్తారన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినాన్ని విశిష్టమైన రోజుగా భావిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ నుండి నాలుగు రోజులు జంక్షన్ వరకు స్థానికులు, ఆటో కార్మికులతో ర్యాలీ చేపట్టారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక



తొండవరంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తొండవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పీవీ కేశవాచార్యులు, ఫిజికల్ డైరెక్టర్ పెచ్చెట్టి సూర్యనారాయణ తెలిపారు. స్థానిక హైస్కూల్లో విద్యార్థులను సోమవారం పలువురు అభినందించారు. సవరపు లావణ్య శ్రీ ఈనెల 25, 26, 27 తేదీల్లో కాణిపాకంలో జరిగే అండర్–18 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో జట్టులో పాల్గొని ఆడనుందన్నారు. స్టాండ్ బైగా పొగాకు పూజిత ఎంపికైందన్నారు. త్వరలో జరిగే అండర్–19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పిల్లి దుర్గాదేవి ఎంపికైందన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో హైస్కూల్ విద్యార్థిని మంద మౌనిక అద్భుత ప్రతిభ ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, అంబాజీపేట ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు, రోహిణీ హాస్పిటల్స్ అధినేత వీవీయస్‌యన్ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ మట్టపర్తి రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మూడు గ్రామాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటు

ఆలమూరు: మండలంలోని పినపళ్ల, పెనికేరు, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఆధార్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ ఎ.రాజు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డును పొంది పదేళ్ల పూర్తయిన లేదా ఆధార్‌లో చేర్పులు, మార్పులను చేయించుకునేందుకు సంబంధిత లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుమ్మిలేరులో రెవెన్యూ గ్రామ సభలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో సోమవారం రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల నుంచి స్వీకరించిన 23 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి, గ్రామ కార్యదర్శి వొబిలిశెట్టి వేణి పాల్గొన్నారు.

ఇవేం గుంతలు బాబోయ్..



మాచవరంలో గుంతలతో నిండి ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: రహదారులపై ప్రయాణికులకి అష్టకష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలకు మాచవరం నుంచి పి.గన్నవరం వెళ్లే ప్రధాన రహదారి గుంతలుగా మారిపోయాయి. అభివృద్ధి లేదు. అభివృద్ధి లేదు..

రోడ్డు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు తప్పుడు ప్రసంగాలు సాగించిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చినా వారికి రోడ్లు, గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే గుంతలు పూడ్చేస్తామని ప్రకటించిన కూటమి నేతలు ఇప్పుడేమో చేతల్లో కాదు మాటలకే పరిమితమైనట్లు వ్యవహరిస్తున్నారు. ఏం.. గోతులు రా నాయనా.. నడుం పడిపోతుంది. ఈ గుంతలు కూడా పూడ్చడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.